




కొల్లూరు : జువ్వలపాలెంలో ఉచిత ఇసుక స్టాక్ పాయింట్‌ను ప్రారంభించి ఇసుక లోడింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వెంకటమురళి



కష్టజీవుల కళ్లలో.. ఆనందం

కుదేలైపోయిన నిర్మాణరంగానికి తిరిగి ప్రాణం పోసేందుకు కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. వైసీపీ సర్కారులో బంగారం కంటే ఖరీదైపోయిన ఇసుకను ప్రజలకు మళ్లీ ఉచితంగా ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. అధికారం చేపట్టిన నెల రోజుల్లోపే కొత్త ఇసుక విధానాన్ని అమలులోకి తెచ్చింది. సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసింది. జిల్లాలోని పలు స్టాక్ పాయింట్లలో అందు బాటులో వున్న ఇసుకను ప్రభుత్వం అందు బాటులోకి తెచ్చింది. దీంతో ఐదేళ్లుగా నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న ఇసుక సంక్షోభానికి పరిష్కారం లభించినట్లయింది. ప్రభుత్వం తీసుకు వచ్చిన ఇసుక విధానంతో నిర్మాణ రంగం గాడిన పడి, నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు తిరిగి లభిస్తాయన్న ఆశ కష్టజీవుల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కార్మికులు మనస్ఫూర్తిగా స్వాగతించడంతో పాటు, హర్షం కూడా వ్యక్తం చేస్తున్నారు. తమకు మంచి రోజులు వచ్చాయని సంబరాలు చేసుకుంటున్నారు.



● లింగాయపాలెం వద్ద ఇసుక నిల్వలు

● ఉచిత ఇసుక పాలసీతో నిర్మాణ రంగానికి ఊతం! ● వైసీపీ ప్రభుత్వ ఇసుక దోపిడీతో కార్మికుల అగచాట్లు ● యజమానులను నిలువుదోపిడీ చేసిన బ్లాక్ మార్కెటింగ్ ● ఐదేళ్లుగా పనులు కోల్పోయి అర్ధాకలితో బతికిన నిర్మాణ కూలీలు ● ఉచిత ఇసుక రావడంతో నిర్మాణ రంగంలో కదలిక ● జిల్లాలో 6 లక్షల మంది నిర్మాణ కార్మికులకు జీవనోపాధి పునరుద్ధరణ

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఇసుక దోపిడీ విధానం కారణంగా ఘోరంగా నష్టపోయిన రంగా ల్లో భవన నిర్మాణ రంగం ఒకటి. 2014- 19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అందించిన ఉచిత ఇసుక పాలసీని రద్దుచేసిన గత వైసీపీ ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీ పేరుతో అడ్డగోలు దోపిడీకి పాల్పడడంతో రాష్ట్రంలో నిర్మాణరంగం కుదేలైపోయింది. ఎక్కడికక్కడ నిర్మాణాలు ఆగిపోవడంతో ఇటు యజమానులు, అటు కాంట్రాక్టర్లు ఎంతగానో నష్టపోయారు. కానీ అంతకు మిం చిన స్థాయిలో కష్టజీవులైన నిర్మాణ కార్మికులు కష్టాలపా లయ్యారు. కాంట్రాక్టర్లు, యజమానులకు ఆర్థికంగా భారం పెరగగా, నిర్మాణ కార్మికులకు ఉపాధే లేకుండా పోయింది. పనులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా ఒక రోజో.. ఒక నెలో.. లేక ఒక ఏడాదో కాదు.. ఏకంగా ఐదేళ్లపాటు నిర్మాణ కార్మికులు చేసేందుకు పనిలేక, తినేం దుకు తిండిలేక నిత్యం నరకం అనుభవించారు. అలాంటి వారికి కొత్త ప్రభుత్వం తెరమీదకు తెచ్చిన ఉచిత ఇసుక పాలసీ తిరిగి ప్రాణం పోసింది.

● అందరికీ అందుబాటులో ఇసుక..

ఎగుమతి, దిగుమతి, రవాణాతో కలిపి రూ. 9, 10 వేలకు దొరికే 18 టన్నుల లారీ ఇసుక వైసీపీ ప్రభుత్వ కొత్త ఇసుక విధానం కారణంగా రూ. 25 నుంచి 30 వేల వరకూ వెళ్లింది. వ్యాపారం మొత్తం వైసీపీ నేతలు, ఇసుక మాఫియా ఆధీనంలో ఉండడంతో సామాన్యులకు ఎవరికీ ఆన్‌లైన్ బుకింగ్‌లో ఇసుక దొరకలేదు. దీంతో సామాన్యు లు బ్లాక్ మార్కెట్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్లాక్ మార్కెట్లో ఒక్కో లారీ ఇసుక రూ. 40 నుంచి 45వేల రూపాయల వరకూ వసూలు చేశారు. అయినా అవసరా లకు తగిన స్థాయిలో ఇసుక దొరకలేదు. ఫలితంగా చాలా మంది నిర్మాణాలు ఆపేసుకున్నారు. కాగా ప్రస్తుత కూట మి ప్రభుత్వం టన్ను ఇసుక ర రూ. 250 లోడింగ్ చార్జీతో అందుబాటులోకి రావడంతో మళ్లీ విని యోగదారుల్లో ఆనందం కనిపిస్తోంది. మొత్తంగా ఎగు మతి, దిగుమతి కూలీలతో కలిపి లారీ ఇసుక రూ. 10 వేల లోపుకే అందుబాటులోకి రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వినియోగదారులందరికీ ఇసుక అందు బాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం, అధికా రులు కృషి చేస్తున్నారు. తొలుత స్టాక్ పాయింట్లలో వున్న వేలాది మెట్రిక్ టన్నుల ఇసుకను వినియోగదారులకు అందించ నున్నారు. వర్షాకాలం కావడంతో అందుబాటులో వున్న ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక సేకరించేందుకు సమ స్యలు న్నాయి. ఆ రీత్యా మూడు జిల్లాల్లో వర్షాకాలంలో కూడా అందుబాటులో వుండే ఇసుక రీచ్‌లపై అధికారులు కస రత్తు చేస్తున్నారు. ఒక్కొక్కరికి రోజుకు 20 టన్నుల ఇసు క మాత్రమే అందిచనున్నారు. కాగా తొలిరోజు సామా న్య వినియోగదారులకు ఎవరికీ ఇసుక అందలేదన్న విమ ర్శలు వినిపిస్తున్నాయి. పెద్ద పెద్ద కాంట్రాక్టర్లు ముందు వరుసలో ఉండడంతో సామాన్యులు వెనకబడి పోయారని, వారికి కూడా అందేలా చర్యలు తీసుకోవా లని వినియోగ దారులు కోరుతున్నారు.

● ఆరు లక్షల మందికి ఉపాధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 6 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు వున్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో వారంతా పనులు కోల్పోయారు. 2020లో కరోనా కష్టకాలంలో వారు నరకం చూశారు. ఆ తరువాత పనులు దొరుకుతాయని ఆశించినా పనులు దొరకలేదు. ప్రభు త్వం ఇసుక ధర పెంచడంతో మూడు జిల్లాల్లో నిర్మాణాలు ఎక్కడివక్కడ ఆగిపోయా యి. అమరావతి నిర్మాణం కూడా ఆగిపోవడంతో వారి పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయార యింది. పనుల కోసం కార్మిక అడ్డాల్లో వందలాది మంది కార్మికులు ఉదయం 6 గం టల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ వేచి చూసినా పనులు దొరకని దీన స్థితి ఏర్పడింది. వారం లో ఒక్కరోజు కూడా పని దొరకక పస్తులున్న ఘటనలు జిల్లాలో అనేకం కనిపిం చాయి. అనేకమంది కార్మికులు ఆత్మ హత్యలకు కూడా పాల్పడిన ఘటనలు చోటు చేసు కున్నాయి. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఐదేళ్ల క్రితం విరమించుకున్న పలు వురు తిరిగి నిర్మాణ పనులు చేప ట్టేందుకు సిద్ధమయ్యారు. తద్వారా నిర్మాణ రంగంలో కొత్త ఊపు కనిపిస్తోంది. తద్వారా కష్ట జీవులకు పని భద్రత లభించినట్లయింది. దీంతో వారి కళ్లలో ఆనందం కనిపిస్తోంది.



బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డులో స్టాక్ పాయింట్‌లో ఇసుకలోడీంగ్‌ను పరిశీలిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ఎలా తీసుకోవాలి

నిబంధనల ప్రకారం వినియోగదారుడు తన ఆధార్, మొబైల్ నెంబరు, అన్‌లోడింగ్ చిరునామా, వాహన నెంబరు వంటివి స్టాక్‌యార్డు సిబ్బందికి అందించాలి. అవన్నీ నమోదు చేసిన తర్వాత విక్రయ రశీదు/ఇన్‌వాయిస్‌ని ఇస్తారు. డిశ్పాచ్ పర్మిట్లని సెక్యూర్డ్ స్టేషనరీలో జారీ చేయాల్సి ఉంటుంది. క్యూఆర్ కోడ్‌ని స్కానింగ్ చేసి నగదు చెల్లిస్తేనే అనుమతులు మంజూరు చేస్తారు. కాగా కొంతమంది లారీ యజమానులు/డ్రైవర్లు సోమవారం రీచ్‌ల వద్దకు ఎవరెవరివో ఆధార్ నెంబర్లు తీసుకొని ఇసుక లోడింగ్ చేయాలని వచ్చారు. ఒక్కో స్టాక్‌యార్డులో 100కు పైగా వాహనాలు బారులుదీరి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉచిత ఇసుక విధానం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు వినియోగదారుడు తప్పనిసరిగా స్టాక్‌యార్డు వద్దకు వచ్చి అన్ని వివరాలు అందజేసేలా నిబంధన పెట్టాల్సిన అవసరం ఉన్నది.

రాష్ట్ర చరిత్రలోనే సువర్ణాధ్యాయం



మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, జూలై 8 : ఉచిత ఇసుకతో ప్రతి పేద వాడి ఇంటా పండుగ అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారదర్శక విధానంతో నాణ్యమైన ఇసుక పంపిణీ టీడీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన నెలలోపే ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకు రావడం జరిగిందన్నారు. ఉచిత ఇసుక విధానంతో సామాన్యులకు భారీ ఊరట లభించిందన్నారు. ఇసుక మాఫియాతో జగన్‌రెడ్డి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు. ఇసుక కుంభకోణం ద్వారా వైసీపీ నాయకులు సుమారు 50వేల కోట్ల రూపాయలు దోచుకున్నారన్నారు. పేదలు ఇళ్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల రూపాయలు అయితే అందులో 3లక్షల రూపాయలు ఇసుక కొనుగోలుకు ఖర్చు చేశారన్నారు. గృహ నిర్మాణ శాఖకు సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేశారన్నారు. కొత్తగా వచ్చిన ఇసుక పాలసీలో నిర్వహణ ఖర్చుల కోసం నామినల్‌గా ధరలు, రవాణా, లోడింగ్ చార్జీలు వసూలు చేస్తారన్నారు. లక్షల మంది భవన నిర్మాణ, అనుబంధ రంగాలకు ఊతమిచ్చేలా ఉచిత ఇసుక పథకం అమలు చేసిన సీఎం చంద్రబాబుకు మంత్రి గొట్టిపాటి కృతజ్ఞతలు తెలిపారు.

నామమాత్రపు ధరకే ఇసుక

తెనాలి, జులై 8, (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానాన్ని కొత్త ప్రభుత్వం ప్రవేశ పెట్టటంతో నిన్నటి వరకు ఆకాశాన్ని అంటిన ఇసుక ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. గతంలో 18 టన్నుల ఇసుక లారీలో 35 నుంచి 40 టన్నులకు పైగా ఇసుకను తరలించుకుపోయి టన్నుల లెక్కన ఒక్కో లారీ కృష్ణా తీర ప్రాంతాల్లోనే రూ. 15వేల నుంచి రూ. 25వేలకు అమ్మిన పరిస్థితి ఉంది. అప్పట్లో రీచ్‌లలో ఇసుక లోడ్ చేస్తే, టన్నుకు రూ. 475 మాత్రమే చెల్లించాలని ప్రభుత్వం రేటు నిర్ణయిస్తే, కాంట్రాక్టర్ సంస్థలు మాత్రం టన్నుకు రూ. 600 నుంచి రూ. 900 వరకు వసూలు చేసిన పరిస్థితి ఉంది. అయితే నూతన విధానంలో ఆయా జిల్లాల్లో ఇసుక రీచ్‌ల దూరం, డంపింగ్ యార్డుల నిల్వలను బట్టి జిల్లా కలెక్టర్‌లే రేటు నిర్ణయిస్తారు. గుంటూరు జిల్లాలో మాత్రం టన్నుకు పోత కూలి కింద రూ. 250 మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. జిల్లాలో కొల్లిపర, మున్నంగి, గుండిమెడ, తాళ్లాయపాలెం, లింగాయపాలెం యార్డుల్లో ఎక్కడైనా టన్నుకు రూ. 250 చెల్లిస్తే చాలు. అంటే 18 టన్నుల లారీకి ఇప్పుడు కేవలం రూ. 4,500 మాత్రమే అవుతుంది. అయితే గతంలో రేట్ల ప్రకారం అయితే టన్ను రూ. 700 సగటు రేటనుకుంటే, 18 టన్నులకు రూ. 12,600 చెల్లించాల్సి వచ్చేది. ఇది కేవలం డిమాండ్ సూత్రం మేరకు మాత్రమే. కొన్నిచోట్లయితే రూ. 15వేలపైనే చెల్లించిన పరిస్థితి ఉంది. బాపట్ల జిల్లాలో అయితే బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డులోని డంప్ దగ్గర టన్నుకు రూ. 551, వేటపాలెం మండలం నాయనిపల్లె డంప్ యార్డులో రూ. 675, మార్టూరులో 458గా ధర నిర్ణయించారు. కొరిశపాడు మండలం అనమనమూరు, కొల్లూరు మండలం జువ్వలపాలెం, అద్దంకి మండలం తిమ్మాయపాలెంలో టన్నుకు కేవలం రూ. 197 మాత్రమే చెల్లించాల్సిఉంది. అయితే గత రేట్లతో పోల్చితే ఇప్పుడున్న రేట్లు చాలా తక్కువ. బాపట్ల జిల్లాలో చాలాచోట్ల దూరం నుంచి ఇసుక తీసుకొచ్చి గతంలో డంప్ చేసిన పరిస్థితి ఉండటం, వినియోగదారుడు రీచ్‌లలో తెచ్చుకున్నా దీనికంటే భారీగానే రవాణా ఖర్చులు చెల్లించాల్సిరావటంతో, ఈ రేట్లు చాలావరకు మేలని, కేవలం కూలి ఖర్చులు మాత్రమే చెల్లించటం వల్ల ధరలో చాలా వెసులుబాటు లభించిందని వినియోగదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక రవాణా ఛార్జీల ఖరారు

● లారీ/ట్రాక్టర్ యజమానులు డీఎంజీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి
● నిర్ణీత ఛార్జీలకు మించి వసూలు చేస్తే కఠిన చర్యలు

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధా నంలో భాగంగా గుంటూరు జిల్లాలో రవాణ ఛార్జీలను అధికార యంత్రాంగం ఖరారు చేసింది. జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు రవాణ శాఖ ఉప కమిషనర్ కరీం తన కార్యాల యంలో ఇసుక రవాణ చేసే లారీలు/ట్రాక్టర్ల యజమానులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విధానాన్ని వారికి తెలియజేసి సాధ్యమైనంత తక్కువ ఛార్జీలనే ప్రజల వద్ద వసూలు చేయాలని ఆదేశించారు. చర్చల అనంతరం ఆరు టైర్లు, 10 టైర్లు, 12 టైర్లు లారీలు, ట్రాక్టర్‌కు శ్లాబుల వారీగా ఛార్జీలను ఖరారు చేశారు. 60 కిలోమీటర్ల దూరం వరకు శ్లాబుల విధానం, ఆ తర్వాత నుంచి కిలోమీటర్‌కు రూ. 7.50 నుంచి రూ. 12 వరకు వాహనాన్ని బట్టి వసూలు చేసుకొనే అవకాశాన్ని కల్పించారు.

15 కిలోమీటర్ల దూరం వరకు:
● ఆరు టైర్ల లారీ(10 టన్నులు)కి రూ. 2 వేలు, 10 టైర్ల లారీ(18 టన్నుల)కి రూ. 3 వేలు, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి రూ. 4 వేలు, ట్రాక్టర్ (5 టన్నులు)కు రూ. 1,500 వసూలు చేసుకోవచ్చు.

16 నుంచి 30 కిలోమీటర్ల దూరం వరకు:
● ఆరు టైర్ల లారీ(10 టన్నులు)కి రూ. 3,500, 10 టైర్ల లారీ(18 టన్నుల)కి రూ. 5 వేలు, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి రూ. 6 వేలు, ట్రాక్టర్(5 టన్నులు)కు రూ. 2,400 వసూలు చేసుకోవచ్చు.

31 నుంచి 45 కిలోమీటర్ల దూరం వరకు:
● 31 నుంచి 45 కిలో మీటర్ల దూరం వరకు: ఆరు టైర్ల లారీ (10 టన్ను ల)కి రూ. 4,500, 10 టైర్ల లారీ (18 టన్నుల)కి రూ. 7,500, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి రూ. 8 వేలు, ట్రాక్టర్ (5 టన్నులు)కు రూ. 3,000 వసూలు చేసుకోవచ్చు.

46 నుంచి 60 కిలోమీటర్ల దూరం వరకు:
● ఆరు టైర్ల లారీ(10 టన్నుల)కి రూ. 5,500, 10 టైర్ల లారీ(18 టన్నుల)కి రూ. 8,500, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి రూ. 10 వేలు, ట్రాక్టర్(5 టన్నులు)కు రూ. 3,500 వసూలు చేసుకోవచ్చు.

60 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం వరకు:
● ఆరు టైర్ల లారీ (10 టన్నుల)కి టన్నుకు ప్రతీ కిలోమీటర్‌కి రూ. 9, 10 టైర్ల లారీ(18 టన్నుల)కి టన్నుకు ప్రతీ కిలోమీటర్‌కి రూ. 7.50, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి టన్నుకు ప్రతీ కిలోమీటర్‌కి రూ. 7.50, ట్రాక్టర్(5 టన్నులు)కు టన్నుకు ప్రతీ కిలోమీటర్‌కు రూ. 12 వసూలు చేసుకోవచ్చు.

లారీ ఇసుక రూ. 10వేలకే వస్తుంది



ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానంతో లారీ ఇసుక రూ. 9 నుంచి 10 వేలకే వస్తుంది. గతంలో వేల రూపాయలు పెట్టిన దొరకని ఇసుక అందరికీ అందుబాటులోకి వస్తే పనులు సాగుతాయి. కార్మికులకు చేతినిండా పని వుంటుంది. తద్వారా ఆకలి, పస్తులు తప్పుతాయి.

- దీవెనరావు, సీఐటీయూ

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం హర్ష ణీయం. గత ప్రభుత్వంలో ఇసుక అందు బాటులో లేక, పనులు కోల్పోయి, కుటుంబాలు గడవక అనేక మంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. చీకటి రోజులు తిప్పికొడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్మి కులకు వరంగా మారుతుంది.

- దండా లక్ష్మీనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సామాన్యులకు అందుబాటులోకి తేవాలి



తొలిరోజు నాకు ఇసుక అందలేదు. పెద్ద పెద్ద కంపెనీలకే అందింది. దీనిపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. సామా న్య వినియోగదారులకు అందేలా చేయాలి. బ్లాక్‌మార్కెట్‌ను నియంత్రించాలి. బ్లాక్ మార్కెట్లో గోతం ఇసుక రూ. 150 అమ్ముతున్నారు. దాన్ని అరికట్టాలి.

- గోనె లూథర్‌పాల్, గుంటూరు సుందరయ్యనగర్ వాసి



● కొల్లిపర వద్ద ఇసుక లోడింగ్ కోసం బారులు తీరిన లారీలు

రూ.18.88 కోట్ల ఎరువులు, పురుగు మందుల అమ్మకాలు నిలిపివేత

● జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు



పురుగుమందుల కంపెనీలలో తనిఖీలు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బృందాలు

గుంటూరు సిటీ, జూలై 8: జిల్లాలోని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సంబంధిత కంపెనీలు, షాపులపై రాష్ట్రస్థాయి తనిఖీ బృందాల దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. సోమవారం గుంటూరు అర్బన్‌తో పాటు, వట్టిచెరుకూరు మండలంలో దాడులు నిర్వహించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ దాడుల్లో రూ.18.88కోట్ల విలువైన పురుగు మందులు, ఎరువులు, బయోఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేశామని తెలిపారు. అదేవిధంగా అనుమతి లేని రూ.12.44 లక్షల విలువైన పురుగుమందులు స్టాక్ చేసిన కారణంగా వాటిని జప్తు చేసినట్లు తెలిపారు. ఈ దాడులు ఇంకా కొనసాగుతాయని ఆయన తెలిపారు. దాడుల్లో ఏడీఏలు నాగేశ్వరరావు, బాలాజీ నాయక్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు శ్రీనివాసరెడ్డి, మాణిక్యరావు, ఏఓలు బీ గౌతమ్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

● కలెక్టర్ జె.వెంకటమురళి ● ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 89 అర్జీలు ● గైర్హాజరైన అధికారులకు ఛార్జిమెమోలు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 8 : ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం తగదని కలెక్టర్ జె.వెంకటమురళీ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్ర మంలో అర్జీలు స్వీకరించిన కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి 89మంది తమ సమస్యలను కలెక్టర్‌కు అర్జీలు ద్వారా వివరించారు. తన పరిధిలో వాటిని తక్షణమే పరిష్కరించి మిగిలిన వాటిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలస్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపారు. ప్రజలు నుంచి వచ్చిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి గడువులో గా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు. నిర్లిప్తత ప్రదర్శిస్తే కుదరదన్నారు. చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. నీటి పన్నులు ఖచ్చితంగా వసూళ్ళు చేయాలని ఆదేశించారు. కార్య క్రమానికి గైర్హాజరైన అధికారులకు చార్జి మెమోలు జారీ చేయాలన్నారు. డీఆర్‌వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

● బాపట్ల పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరు తూ బహుజనసమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరా వు, నియోజకవర్గ ఇన్‌చార్జి గుదే రాజారావు, తురిమెళ్ళ అమ్మేశ్వరరావులు సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఫిర్యాదు చేశారు.

● బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల దగ్గర నుంచి మార్కెట్‌యార్డు వరకు హైవే రోడ్డు నిర్మాణ పనుల్లో అవకతవకలు జరిగాయని దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించాలంటూ దగ్గుమల్లివారిపాలెంనకు చెందిన అమ్మేశ్వరరావు సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌ని వినతిపత్రం ద్వారా కోరారు.



ప్రజాదర్బార్‌కు బారులు తీరిన ప్రజలు

సమస్యల పరిష్కార వేదికగా ప్రజాదర్బార్

● 13వ రోజు ప్రజాదర్బార్‌కు విన్నపాల వెల్లువ

తాడేపల్లి, జూలై 8: ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన ప్రభుత్వం కృషి చేస్తోంది. గత ఐదేళ్ల ఎలాంటి భరోసా లభించక సామాన్యులు అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందిపడ్డారు. అలాంటి వారికి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ భరోసా ఇస్తోంది. మంగళగిరితోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఉండవల్లి నివాసంలో యువనేతను నేరుగా కలిసి తమ సమస్యలను విన్నవిస్తున్నారు. సోమవారం పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తి స్వీకరించిన యువనేత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

న్యాయం కోసం యువనేతను కలిసిన రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబం

రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ అయిన తన భర్తను ఆస్తికోసం వారి అన్నదమ్ములు హత్యచేశారని, తగిన న్యాయం చేయాలని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఇంటి పుష్పావతి, ఆమె కుమారుడు సురేష్, మంత్రి లోకేశ్‌ను కలిసి కన్నీటి పర్యంతమయ్యారు. 2013లో ఇంటి రామలింగం హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగవిరమణ చేశారు. అప్పటి నుండి స్వగ్రామంలోనే నివసిస్తున్నారు. రామలింగానికి రెండు ఎకరాల పొలం ఉండగా గత ప్రభుత్వ అండతో ఆయన సోదరులు కబ్జా చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పథకం ప్రకారం ఆయనను హత్య చేశారు. వారి 11 ఆవులను చంపడంతోపాటు కొబ్బరిచెట్లను నరికివేసి భయభ్రాంతులకు గురిచేశారు. పోలీసులకు ఫిర్యాదుచేయగా ఆనాటి పాలకొల్లు సీఐ, ఎస్ఐ నిందితులతో కుమ్మక్కై కేసును నీరుగార్చారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కేసును రీఓపెన్ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి లోకేశ్ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

సొంతింటి కల నెరవేర్చాలి

గత ప్రభుత్వం తొలగించిన రేషన్‌కార్డు, దివ్యాంగ పెన్షన్ పునరుద్ధరించాలని మంగళగిరి నియోజకవర్గం సీతా నగరానికి చెందిన ధనుకొండ గిరిధర్ సాగర్, లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కార్పెంట్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తనకు సొంత ఇల్లు లేదని, ఇల్లు మంజూరుచేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన ఉద్దంటి వీరాంజనేయులు కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తెకు దివ్యాంగ పెన్షన్ మంజూరుచేయాలని చింతలపూడికి చెందిన తిరుమలశెట్టి శివనాగేశ్వరమ్మ విజ్ఞప్తి చేశారు. ఇంజనీరింగ్ చేసిన తనకు ఉద్యోగం కల్పించాలని తాడేపల్లికి చెందిన చైతన్యసాయి కోరారు. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని వృద్ధాప్య పింఛన్ మంజూరుచేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన వెనిగళ్ల కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యఖర్చుల కోసం అప్పులపాలయ్యామని ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని మంగళగిరి ఆంజనేయకాలనీకి చెందిన వీ రామలింగసాయి కోరారు. మంగళగిరి 27వ వార్డులోని చర్చి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, బండారు క్రిష్టఫర్ కోరారు. శృంగారపురం మీదుగా రేవేంద్రపాడు నుండి పెదపాలెం వరకు ఉన్న ఆర్అండ్‌బీ సీసీ రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరారు. గత ప్రభుత్వం డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల కోసం నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష తప్పులతడకగా ఉండడంతో తీవ్రంగా నష్టపోయామని తగిన న్యాయం చేయాలని ఉపాధ్యాయులు యువనేతను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలు పరిష్కరిస్తామని లోకేశ్ అర్జీదారులకు భరోసా ఇచ్చారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుండి ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది.



దివ్యాంగుడి నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న నారా లోకేశ్



ప్రజాదర్బార్‌కు కుటుంబసభ్యులతో వస్తున్న దివ్యాంగులు

కార్మికులకు జీవనోపాధికి భరోసా..

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జూలై 8: రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఉచిత ఇసుక పాలసీ రాష్ట్రంలోని లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికుల జీవనోపాధికి భరోసా ఇచ్చిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన ఇసుక విధానంతో సామాన్యులకు ఇసుక ధరాభారాన్ని ఎంతో తగ్గించిందన్నారు. నాణ్యమైన ఇసుకను పారదర్శక పంపిణీ విధానం ద్వారా ప్రజలకు అందుబాటులో వుంచాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. జగన్మోహన్‌రెడ్డి హయాంలో ప్రభుత్వం ఇసుక మాఫియాను నడిపిందని, ఒక్క ఇసుక కుంభకోణం ద్వారానే 50 వేల కోట్లకు పైగా ఆ పార్టీ నేతలు కొల్లగొట్టారన్నారు. పేదలు ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు ఖర్చు అయితే అందులో ఇసుక కొనేందుకే 3 లక్షలు ఖర్చు పెట్టాల్సిన దుస్థితి వైసీపీ హయాంలో ఏర్పడిందన్నారు. జిల్లా స్థాయిలో ఇసుక కమిటీలు ఏర్పాటు చేసి కలెక్టరు, జేసీ, ఆర్డీవో, మైనింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఉచిత ఇసుక పాలసీపై నిరంతర విజిలెన్స్ పర్యవేక్షణ వుంటుందని, సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు ఇసుకను అందించనున్నట్లు యరపతినేని తెలిపారు.

ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాట



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూలై 8 : ఉచిత ఇసుక పాలసీతో రాష్ట్ర ప్రగతికి ప్రభుత్వం బాట వేసిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీతో నిర్మాణ రంగం ఊపందుకోనుందన్నారు. అలాగే సొంత ఇల్లు నిర్మించుకోవాలనుకునే సామాన్యులు, మధ్య తరగతి ప్రజల కల నెర వేరనుందని తెలిపారు. అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే ఇచ్చిన హామీలలో ఒక్కొక్కటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తూ వస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు మాఫియా ముఠాగా ఏర్పడి ఒక్క ఇసుక ద్వారానే రూ. రూ 50 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడినట్లు ఆరోపించారు. జగన్ బినామీ సంస్థ జేపీ వెంచర్స్ చెల్లించాల్సిన మొత్తం నుంచి రూ.800 కోట్లు మినహాయించారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇసుక పాలసీపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరికి ఇసుకను అందిస్తుందన్నారు.

ఉచిత ఇసుక పాలసీ.. పేదలకు కానుక

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, జూలై 8: ఉచిత ఇసుక పాలసీ.. పేదలకు ప్రజా ప్రభుత్వం ఇచ్చే కానుక అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం గుంటూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో ఇసుక పేదలకు అందని ద్రాక్ష అని, వైసీపీ ముఠాలోని రియల్టర్లు ఇసుకను కొల్లగొట్టి అప్పటి సీఎం జగన్‌రెడ్డికి కోట్లు కూడబెట్టారన్నారు. నాణ్యమైన ఇసుకను అవసరమైన వారందరికీ, ముఖ్యంగా పేదలకు అందుబాటులో ఉంచాలన్నదే కూటమి ప్రభుత్వ విధానమన్నారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే జీవో 43తో సీఎం చంద్రబాబు నూతన ఇసుక పాలసీని అమలు చేయటం ఎంతో గొప్పవిషయమన్నారు.

హామీ మేరకు ఉచిత ఇసుక విధానం అమలు

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, జూలై 8: ఎన్నికల హామీలో భాగంగా చంద్రబాబునాయుడు ఇచ్చినమాట ప్రకారం నేటి నుంచి ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం తన అనుయాయులకు లబ్ధి చేకూర్చడమే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా ఇసుక విధానాన్ని జేపీ కంపెనీస్‌కి కట్టబెట్టిందని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన రెవెన్యూ కూడా చెల్లించకుండా మొత్తం దోచేశారన్నారు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణరంగం కుదేలై ఆ రంగాన్ని నమ్ముకున్న అనేక రకాల కార్మికులు పస్తుండే పరిస్థితి తెచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక రంగాలలో పనిచేస్తున్న కార్మికుల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వానికి రావలసిన రెవెన్యూ కూడా వదులుకొని ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ విధానం ద్వారా నిర్మాణరంగం పరిగెత్తడమే కాకుండా ఈ రంగంపై ఆధారపడిన అనేక రకాల కార్మికులకు జీవనోపాధి కల్పించినట్లు అవుతుందన్నారు. గత ఐదేళ్ల కాలంలో మధ్యతరగతి వారు ఇసుక ధరలు భరించలేక కనీసం గృహనిర్మాణం కూడా చేసుకోలేకపోయారని, నేడు వారందరూ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. సీనరేజీ లేకుండా లోడింగ్, రవాణా చార్జీలతో ఇసుకను పొందే అవకాశాన్ని కుల, మత, వర్గ భేదం లేకుండా అన్నిరంగాల వారికి అవకాశాన్ని కల్పించారని అన్నారు. ఒక దార్శనికుడికి అధికారం వస్తే ఎలా ఉంటుందో మొన్న పెన్షన్ల పెంపుగాని, నేడు ఉచిత ఇసుక విధానంగాని రుజువు చేస్తుందని అన్నారు.

విద్యావ్యవస్థలోని సమస్యలను పరిష్కరించాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల



సమావేశంలో మాట్లాడుతున్న మంజుల

శావల్యాపురం, జూలై 8: విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల అన్నారు. సభ్యత్వనమోదు ప్రక్రియలో భాగంగా మండలంలోని పోట్లూరు, శావల్యాపురం జడ్పీపాఠశాలలను ఏపీటీఎఫ్ నాయకులతో కలసి సోమవారం ఆమె సందర్శించారు. ఉపాధ్యాయులను కలసి ఏపీటీఎఫ్‌లో సభ్యత్వాన్ని తీసుకోవాలని కోరుతూ సభ్యత్వ నమోదుపత్రాలు అందజేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యావ్యవస్థలో ఏళ్ళ తరబడి పరిష్కారం కాని అనేక సమస్యలున్నాయని, ఎన్నికల హామీగా సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం 117 జీవోను రద్దుచేసి ప్రాథమిక పాఠశాలలకు పునర్‌వైభవాన్ని తేవాలని, డీఎస్సీ నిర్వహణకు సమయమున్నందున విద్యార్థులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖలో ప్రతినెలా ఉపాధ్యాయులకు ప్రమోషన్‌లు ఇవ్వవచ్చని జీవో ఉన్నప్పటికీ ఏడాదిగా ప్రమోషన్‌లు ఇవ్వకుండా నిలిపివేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జడ్పీపాఠశాలల్లో ప్రభుత్వం జూనియర్ కళాశాలలను ఏర్పాటుచేసిందని, కానీ ఉపాధ్యాయుల కొరత ఉండడంతో విద్యాబోధన కష్టతరంగా మారిందన్నారు. సీబీఎస్‌సీ బోర్డు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని పాఠశాలల్లో మాత్రమే సీబీఎస్‌సీ విధానాన్ని అమలు చేస్తుందని, మిగిలిన పాఠశాలలలోని పదవ తరగతి విద్యార్థులు ఈఏడాది ఏ విధానంలో పరీక్షలు రాయాలో అర్థంకాక ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. సీబీఎస్‌సీపై ప్రభుత్వం నిర్దిష్టమైన నిర్ణయాన్ని వెల్లడించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియాన్ని కూడా కొనసాగించాలని అనేక సందర్భాలలో తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళామని, తెలుగు రాష్ట్రాలలోని విద్యార్థులకు తెలుగు మీడియంలో చదువుకొనే స్వేచ్ఛను ప్రభుత్వం కల్పించాలన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల మరమ్మతుల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా చాలా పాఠశాలలను పడగొట్టి ఉన్నారని, విద్యార్థులు చెట్ల కింద కూర్చొని విద్యను అభ్యసిస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి దానిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పల్నాడుజిల్లా ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కేఎస్‌కే షరీఫా, మండలాధ్యక్షులు గురుబాబు, మహమ్మద్, గోపీ, ఖాన్, సైదా, టీవీ నాగేశ్వరరావు, మాలతి తదితరులు పాల్గొన్నారు.

పిన్నెల్లి బెయిల్ పిటిషన్ 10కి వాయిదా

గుంటూరు, జూలై 8: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బెయిల్ పిటిషన్ ఈనెల 10కి వాయిదా వేశారు. కాగా ఈ కేసులో ప్రభుత్వం స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా హైకోర్టు న్యాయవాది అశ్వినీకుమార్‌ను నియమించింది. అయితే గురజాల కోర్టుకు జడ్జి లేకపోవడంతో ఆ కోర్టుకు గుంటూరు నాలుగవ జిల్లా సెషన్స్ జడ్జి కం ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి శరత్‌కుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఈ క్రమంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బెయిల్ పిటిషన్ విచారణకు వచ్చింది. అయితే విచారణ సందర్భంగా ప్రభుత్వం నియమించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశ్వినీకుమార్ అందుబాటులోకి రాలేదు. ఈ కేసులో స్పెషల్ పీపీ అశ్వినీకుమార్ రెండు వాయిదాలకు గైర్హాజరవడం పట్ల జడ్జి అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా సోమవారం పిన్నెల్లి బెయిల్ పిటిషన్‌పై తమ వాదనలు వినిపించేందుకు డిఫెన్స్ న్యాయవాదులు సిద్ధమయ్యారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ అందుబాటులో లేకపోవడంతో కేసును ఈ నెల 10కి వాయిదా వేశారు. అత్యంత కీలకమైన ఈ కేసులో బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరగాల్సిన సమయంలో అశ్వినీకుమార్ గైర్హాజరు కావడం న్యాయవాద వర్గాల్లో చర్చనీయాంశమైంది.

పోలింగ్ బూత్‌లో హత్యాయత్నంపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు

● 14మంది నిందితుల జాబితా ఐజీకి అందించిన సుధాకర్

గుంటూరు, జూలై 8: ఇటీవలి సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా తెనాలిలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేయిచేసుకోగా తిరిగి బాధితుడు కూడా చేయిచేసుకున్న ఘటనలో ఆయనపై జరిగిన దాడికి సంబంధించిన కేసులో ఇంతవరకు చర్యలు తీసుకోలేదని తెనాలి ఐతానగర్‌కు చెందిన బాధితుడు గొట్టుముక్కల సుధాకర్ సోమవారం ఐజీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. పోలింగ్ రోజున క్యూలో ఉన్న ఓటర్ సుధాకర్‌పై అప్పటి ఎమ్మెల్యే శివకుమార్ చేయిచేసుకోగా సుధాకర్ కూడా తిరిగి చేయిచేసుకున్న ఘటన సంచలనం సృష్టించింది. ఈ సందర్భంగా సుధాకర్‌పై ఎమ్మెల్యే అనుచరులు, బంధువులు పెద్ద ఎత్తున విచక్షణారహితంగా దాడిచేసి కొట్టారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు తెనాలి-2 టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆ కేసులో ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో సోమవారం బాధితుడు సుధాకర్ ఐజీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తనపై హత్యాయత్నం చేశారని, ఈ సందర్భంగా నమోదైన కేసులో హత్యాయత్నం సెక్షన్ 307ను చేర్చాలని కోరారు. తాను గుర్తించిన 14మంది నిందితుల వివరాలను ఐజీకి అందించినట్లు తెలిపారు. వారితో పాటు మిగిలిన వారిని కూడా గుర్తించి వారందరిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తనపై దాడి చేసిన వారిలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఆయన కుమారులు సత్యనారాయణ, అఖిల్ గణేష్, మేనల్లుడు నల్లూరి హర్షవర్ధన్, అన్నాబత్తుని శ్రీధర్‌తో పాటు గుడ్డేటి సురేంద్ర, మేకల సాగర్, కొడాలి శ్రీనివాసరావు, కొమ్ము రాజేష్, వేజెండ్ల శ్రీకాంత్, అక్కిదాసు కిరణ్ కుమార్, ఖాజు, షేక్ జానీ, తెనాలి పున్నయ్య తదితరుల పేర్లను ఐజీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి ఆ కేసులో హత్యాయత్నం సెక్షన్ చేర్చడంతోపాటు తను అందించిన 14 మందితో పాటు మిగిలిన నిందితులను కూడా అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని సుధాకర్ కోరారు.

విజ్ఞాన్స్ వర్సిటీలో ప్రారంభమైన టీసీఎస్ ఎన్‌క్యూటీ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు

గుంటూరు(విద్య), జూలై 8: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న టీసీఎస్ ఎన్‌క్యూటీ (నేషనల్ క్వాలిఫైడ్ టెస్ట్) ఇంటర్వ్యూలను సోమవారం టీసీఎస్ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టీసీఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ 2024 సంవత్సరంలో బీటెక్ పూర్తిచేసి ఎన్‌క్యూటీ ద్వారా ఎంపిక చేయబడిన విద్యార్థులకు విజ్ఞాన్స్ వర్సిటీలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మెగా డ్రైవ్‌కు ఉమ్మడి గుంటూరు, కృష్ణా, వైజాగ్ ప్రాంతాల్లోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 3000మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో సత్తాచాటిన విద్యార్థులకు టీసీఎస్ నింజా రూ.3.39లక్షలు, టీసీఎస్ డిజిటల్ రూ.7లక్షలు, టీసీఎస్ ప్రైమ్ రూ.9లక్షల వార్షిక వేతనం చెల్లిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో టీసీఎస్ కంపెనీ ప్రతినిధులు, విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి ఒలంపియాడ్‌లో భాష్యం విద్యార్థి ప్రతిభ




విద్యార్థిని అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య), జూలై 8: భాష్యం విద్యార్థులు చదువులోనే కాకుండా అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో సైతం తమ సత్తా చాటుతున్నారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మెయిన్ క్యాంపస్‌లో అంతర్జాతీయ స్థాయి ఒలంపియాడ్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన భాష్యం విద్యార్థి తేజేష్ కాకర్లను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఎస్ఓఎఫ్ నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలో భాష్యం విద్యార్థి తేజేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడని, ఇటీవల విడుదలైన ఫలితాల్లో అంతర్జాతీయ స్థాయిలో 146వ ర్యాంకును, జోనల్ లెవల్లో 2వ స్థానాన్ని పొంది వెండిపతకాన్ని, నగదు బహుమతిని గెలుచుకున్నాడని ఆయన చెప్పారు.. కార్యక్రమంలో భాష్యం మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్, లిటిల్ ఛాంప్స్ ప్రిన్సిపాల్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కస్టడీకి దాసరి వీరయ్య

మంగళగిరి, జూలై 8: దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో ఇటీవల జరిగిన యువకుడి హత్య కేసుకు సంబంధించి నిందితుడు దాసరి వీరయ్య తెనాలి కోర్టులో లొంగిపోయాడు. హత్య కేసు విచారణలో భాగంగా వీరయ్యను కస్టడీకి అనుమతించాలని పోలీసులు న్యాయస్థానాన్ని కోరారు. కోర్టు అనుమతితో వీరయ్యను రెండు రోజులపాటు పోలీసు కస్టడీకి తీసుకున్నారు. మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ముఖ్య అనుచరుడైన దాసరి వీరయ్యపై పలు ఆరోపణలు వున్నాయి. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో వీరయ్య కూడా కీలక సూత్రధారిగా వున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు ముందు మంగళగిరిలో సంచలనం రేకెత్తించిన అక్రమ మద్యం నిల్వల కేసులో కూడా వీరయ్య పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో పర్యాటక శాఖ ఉద్యోగి మృతి



రామారావు (ఫైల్)

మాచర్ల రూరల్, జూలై 8: రోడ్డు ప్రమాదంలో పర్యాటకశాఖ ఉద్యోగి మృతిచెందిన సంఘటన మండలంలోని ఏకోనాంపేట వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. విజయపురి సౌత్‌కు చెందిన కొదమగుండ్ల రామారావు (45) పర్యాటక కేంద్రమైన ఎత్తిపోతలలో కుక్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎత్తిపోతలలో రాత్రి డ్యూటీ ముగించుకొని సాగర్‌లోని తన ఇంటికి బైకుపై వెళ్తుండగా మార్గ మధ్యంలోని ఏకోనాంపేట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం అతివేగంతో ఢీకొట్టింది. దీంతో రామారావు తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని తెలంగాణ ప్రాంతంలోని హిల్‌కాలనీ ప్రభుత్వ వైద్యశాలకు తరలిచగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభి రామయ్య తెలిపారు.

తమ్ముడి అరాచకాలు భరించలేక

హతమార్చిన అన్న, బాబాయి



నర్రా భార్గవ్ మృతదేహం

అమరావతి, జూలై 8: వరుసకు తమ్ముడైన యువకుడు చేస్తున్న అరాచకాలు భరించలేక అన్న, బాబాయి కలసి హతమార్చిన సంఘటన మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ధరణికోట గ్రామానికి చెందిన నర్రా ఉమామహేశ్వరరావు మనవడు అయిన నర్రా భార్గవ్(30) తల్లి చిన్నతనంలో చనిపోగా భార్గవ్‌ను పెద్దమ్మ వరుసైన చిట్టెమ్మ పెంచింది. భార్గవ్ చెడు అలవాట్లకు లోనై చిట్టెమ్మను బెదిరించి సంవత్సరం క్రితం అర ఎకరం భూమి తన పేర రాయించుకున్నాడు. భార్గవ్‌కు భార్య కుమారుడు ఉన్నారు. దురలవాట్లకు బానిసైన భార్గవ్ తనను పెంచిన చిట్టెమ్మను చంపుతానని బెదిరించడం, కొట్టడం చేస్తున్నాడు. అది గమనించిన చిట్టెమ్మ కుమారుడు నూతలపాటి శ్రీనివాసరావు, భార్గవ్‌ను మందలించగా అతనిని కూడా చంపుతానని బెదిరించాడు. దీంతో శ్రీనివాసరావు వరుసకు బాబాయి అయిన నంబూరు శ్రీనివాసరావు సహకారంతో ఇద్దరు కలసి భార్గవ్‌ను అమరావతిలోని బాపూజీ కాలనీలో ఉన్న ఇంటికి తీసుకెళ్లి హతమార్చారు. తరువాత భార్గవ్ మృతదేహాన్ని ఆరుడొంకల బావి సమీపంలోని బైపాస్ రోడ్ సమీపంలో పడవేసి మరలా అక్కడనుండి ధరణికోటలోని భార్గవ్ ఇంటికి తీసుకెళ్లి తాత ఉమామహేశ్వరరావుకు అప్పగించారు. యాక్సిడెంట్‌లో భార్గవ్ గాయపడ్డాడని తెలుసుకుని అక్కడ నుండి ఇంటికి తీసుకు వచ్చామని చెప్పారు. ఉమామహేశ్వరరావు భార్గవ్ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఉమామహేశ్వరరావు తన మనవడిని ఇద్దరు ఇంటి వద్ద నుండి తీసుకెళ్లి హతమార్చారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌హెచ్‌ఓ ఏవీ బ్రహ్మం ఉమామహేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులు పరారీలో ఉన్నారు.

ఏపీ పీసెట్ ఫలితాలు విడుదల

పెదకాకాని, జూలై 8: ఆంధ్రప్రదేశ్‌లో వ్యాయామ విద్య కోర్సులైన బీపీఈడీ, యూజీడీపీఈడీ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024 ఫలితాలను సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తాత్కాలిక రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి. జాన్సన్ మాట్లాడుతూ జూన్ 24నుంచి 27వరకు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నిర్వహించిన పీసెట్ పరీక్షల ఫలితాలు విడుదల చేశామని పేర్కొన్నారు. ఈ పరీక్షకు 1641మంది దరఖాస్తు చేసుకోగా, 1124మంది హాజరయ్యారని, వారిలో 784మంది పురుషులు, 340 మంది మహిళా అభ్యర్థులు పరీక్షలకు వచ్చినట్లు పేర్కొన్నారు. వారిలో 1064 మంది 95.11% అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఏపీ పీసెట్ వెబ్సైట్ నుంచి ర్యాంక్ కార్డులను డౌన్లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఉన్నత విద్యా మండలి ఆదేశానుసారం త్వరలో ప్రవేశాల వివరాలు వెల్లడిస్తామని ప్రొఫెసర్ జాన్సన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ పీసెట్ కన్వీనర్ డాక్టర్ డి.సూర్యనారాయణ, వ్యాయామ విద్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

20న రోప్ స్కిప్పింగ్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు

గుంటూరు(తూర్పు), జూలై 8: స్థానిక గోరంట్ల, అమరావతి రోడ్డు, నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూలు క్రీడా మైదానంలో ఈనెల 20న జిల్లా రోప్ స్కిప్పింగ్ ఉమ్మడి జిల్లా జట్ల కొరకు ఎంపికలు నిర్వహిస్తునట్టు రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి తిరుపతి రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 8, 10, 12, 14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు నిర్వహిస్తునట్టు పేర్కొన్నారు. ఎంపికైన జట్టును ఆగస్టులో జరిగే రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు పంపనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 63048 81562, 82475 65411 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

26,159 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 29,187 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 26,159 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 14,317 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	16500
నెంబరు.5	11000	14200
273	11000	12000
341	9000	16500
4884	12000	12000
సూపర్ 10	13500	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	19000
బ్యాడిగి	9000	18000
దేవనూరుడీలక్స్	10000	13500
తెల్లకాయలు	5000	13000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8500	13500
నెంబరు. 5	9000	10000
273	13000	13000
341	8500	16500
4884	13500	16000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9500	18000
బ్యాడిగి	9000	13000
దేవనూరుడీలక్స్	12000	12000
తెల్లకాయలు	5000	12000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు నాలుగు వినతులు



ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న అడవులదీవి ప్రజలు

రేపల్లె, జూలై 8: ప్రజాసమస్యల పరిష్కారవేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు నిజాంపట్నంకు చెందిన విశ్వనాథపల్లి శివగంగ పార్వతికి చెందిన భూమిని పసుమర్తి డైమెండ్‌బాబు తన భూమి అని చెబుతూ ఆరోపిస్తు అర్జీ పెడుతున్నారని, భూమిని సర్వే చేసి ఇప్పించాల్సిందిగా అర్జీలు పెట్టుకున్నారన్నారు. అడవులదీవికి చెందిన కె.మోహన్‌రావు పైలెట్ వాటర్ స్కీమ్‌కు మంజూరైన 10.50ఎకరాల భూమిని ఆర్‌డబ్ల్యూఎస్ వారికి అప్పగించి గ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించాల్సిందిగా కోరారు. హైస్కూల్‌కు వెళ్లే దారి ఆక్రమణకు గురైందని ఆక్రమణ తొలగించాలని కోరారు. రేపల్లె మండలం పోటుమెరక గ్రామానికి చెందిన కాగితాల రవిబాబు తన పంట భూమి పక్కన రొయ్యల చెరువులు ఉన్నాయని, వాటి నుంచి వచ్చే ఉప్పు నీరు వల్ల పంట పొలాలు దెబ్బతింటున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలను విచారించి పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

వేమూరులో మూడు అర్జీలు



ప్రజాసమస్యల పరిష్కార వేదిక అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

వేమూరు, జూలై 8 : వేమూరు మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు అందినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. వేమూరుకి చెందిన సీహెచ్ శ్రీదేవి బీమా మంజూరు నిమిత్తంగా అర్జీ దాఖలు చేశారు. ఎం శ్యామల సర్వే నెంబర్ 656/1లో నడకదారికి సర్వే చేయించి సహకరించాలని కోరారు. చావలికి చెందిన ఎన్.కోటేశ్వరరావు డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తూ తనకు రావలసిన జీతం బకాయిలను ఇప్పించాలని కోరుతూ అర్జీ దాఖలు చేసినట్లు ఎంపీడీవో వివరించారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

బాపట్ల, జూలై 8 : బాపట్ల మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. మొత్తం 40బ్యాచ్‌లుగా విద్యుత్ అధికారులు ఏర్పడగా నాలుగు బ్యాచ్‌లుగా విజిలెన్స్ అధికారులు ఏర్పడి తనిఖీ నిర్వహించారు. మండలంలో 3,127 సర్వీస్‌లు తనిఖీ చేయగా విద్యుత్ చౌర్యానికి సంబంధించి 13 కేసులు నమోదు చేసి రూ.17వేలు జరిమానా విధించారు. అదనపులోడ్ కింద 109 సర్వీస్‌లకు రూ.4 లక్షల 78వేలు విధించారు. మాల్‌ప్రాక్టీస్‌కు సంబంధించి రెండు కేసులకుగాను 15వేల రూపాయలు జరిమాన విధించారు. మొత్తం రూ.5 లక్షల 10వేల జరిమాన విధించినట్లు బాపట్ల విద్యుత్ ఈఈ జి.ఆంజనేయులు తెలిపారు. తనిఖీలలో గుంటూరు విద్యుత్ విజిలెన్స్ ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి, డిప్యూటీ ఈఈ బి.హరిప్రసాదరావు, ఎం శ్రీనివాసరావు, ఆర్ విజయశ్రీనివాస, రూరల్ ఏఈ వైకోటేశ్వరరావు, బాపట్ల డివిజన్‌లోని ఏడీఈలు, ఏఈలు, విజిలెన్స్ ఏఈలు, డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

భట్టిప్రోలు, జూలై 8 : మండలంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో సోమవారం విజిలెన్స్ వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నకిలీ విత్తనాలు, తూనికలు, కొలతల్లో తేడాలు, అధిక ధరలకు అమ్మకాలు లేకుండా ఉండేందుకు తనిఖీ నిర్వహించినట్లు అధికారులు తెలియజేశారు. విజిలెన్స్ అధికారులు నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ సీనియర్ అధికారి సీహెచ్ రవికుమార్‌ల ఆధ్వర్యంలో స్టాక్ రిజిష్టర్లు, బిల్ బుక్స్, పురుగు మందులను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్, ఏవోలు తిరుమలరావు, జి.మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె ఎరువుల షాపుల్లో ..



నాదెండ్ల నాగేంద్రం ఎరువుల దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

రేపల్లె, జూలై 8 : పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారని, గోడౌన్‌లో ఉన్న స్టాక్ రిజిష్టర్లను పరిశీలించామని విజిలెన్స్ ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని తేజ సీడ్స్ సాహితి ఏజెన్స్ నాదెండ్ల నాగేంద్రం విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపుల్లో తనిఖీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ రిజిష్టర్‌లో బిల్లుబుక్‌ను నిల్వ ఉంచిన ఎరువులను తనిఖీ చేశామని తెలిపారు. సాహితి ఏజెన్సీకి చెందిన కొన్ని కంపెనీల విత్తనాలకు ఫామ్‌సీ లేనందున రూ.లక్షా రెండువేలు రూపాయల విలువ కలిగిన విత్తనాలకు నోటీసలు ఇవ్వటం జరిగిందనిన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్, ఏవో తిరుమలరావు, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం భూమికి కౌలువేలం

బాపట్ల, జూలై 8 : మండలంలోని గుడిపూడి గ్రామంలో ఉన్న చంద్రమౌళేశ్వర స్వామి దేవస్థానంకు సంబంధించిన పొలం కౌలుకు సోమవారం వేలంపాట జరిగింది. ఈ దేవస్థానంకు సంబంధించి భర్తీపూడి గ్రామంలో ఉన్న ఎకరం 36సెంట్లకు వేలం నిర్వహించగా మానుబ్రోలుకృష్ణ రూ.60వేలకు పాడుకున్నారు. కార్యక్రమంలో ఈవో వీరారెడ్డి, భర్తీపూడి గ్రామసర్పంచ్ అచంట అమరేష్, గుడిపూడి మాజీ సర్పంచ్ గరికపాటి వీరయ్య పాల్గొన్నారు.

ఉచిత ఇసుక ఇవ్వటం హర్షణీయం

● జనసేన దివ్యాంగుల నాయకులు గోగన ఆదిశేషు

బాపట్ల, జూలై 8 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఉచిత ఇసుక ఇవ్వటం హర్షణీయమని జనసేన దివ్యాంగుల నాయకులు గోగన ఆదిశేషు అన్నారు. దివ్యాంగుల నాయకులతో కలిసి సోమవారం ఆయన మాట్లాడుతూ ఇల్లు కట్టుకుంటున్న దివ్యాంగులంతా ఉచిత ఇసుకను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పి.బాలసుందర్, కంది వెంకటరెడ్డి, వీర్రాజు, పి.లక్ష్మీ, జానీబాషాలు పాల్గొన్నారు.

తీరంలో కోడి పందాలు

బాపట్ల, జూలై 8 : తీర ప్రాంతంలో జోరుగా కోడి పందాలు సాగుతున్నాయి. రేపల్లె నియోజకవర్గంలోని కృష్ణానది కరకట్ట ఒడ్డున పందెం రాయుళ్లు ఆదివారం కావడంతో చుట్టుపక్కల గ్రామాల వారితో కలసి పందాలు జోరుగా నిర్వహించారు. వందలాది మంది పందెంరాయుళ్లు పాల్గొన్నారు. అదుపు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల కూడా కాకముందే పందాలు జరగటం చర్చనీయంగా మారింది.

రెండు వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

బాపట్ల, జూలై 8 : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో తవ్వకాల దగ్గర రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఘటనలో 3వవార్డు వైసీపీ నాయకులు షేక్ సుభానీకి తీవ్రగాయాలయ్యాయి.. దీంతో అక్కడ ఉన్న ఆటో స్టాండ్‌వారు క్షతగాత్రుడిని హుటాహుటినా ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స చేసి క్షతగాత్రుడిని గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహన చోదకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఉచిత ఇసుక విధానం అమలు

● లోడింగ్, రవాణా చార్జీలు మాత్రమే వసూలు

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



జువ్వలపాలెంలో ఉచితంగా వినియోగదారులకు అందించే పనిలో భాగంగా ఆన్‌లైన్ బుకింగ్ స్లిప్‌ను చూపిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, జూలై 8 : ఎన్నికల హామీలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక పథకాన్ని అమల్లోకి తెచ్చారని మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కొల్లూరు మండలంలోని జువ్వలపాలెం వద్ద కృష్ణానది సమీపంలో ఉచిత ఇసుక స్టాక్ పాయింట్‌ను కలెక్టర్ జె.వెంకటమురళీ కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఇసుక భారంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం సీనరేజ్, రవాణా చార్జీలు మాత్రమే తీసుకుని పేద, మధ్యతరగతి ప్రజల కోసం ఉచితంగా ఇసుక అందిస్తున్నట్లు చెప్పారు. దీంతో పేదల సొంతింటి కల నెరవేరబోతుందని, ఆగిపోయిన నిర్మాణ రంగం ఊపందుకోనుందని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ప్రజల కోసం ఉచిత ఇసుక పాలసీ తీసుకు రావడం అభినందనీయమన్నారు. జగన్ పాలనలో ఇసుక మాఫియా ద్వారా రూ.50 వేల కోట్లకు పైగా కొల్లగొట్టారని, వైసీపీ నేతలే ఇసుకసుర అవతారమెత్తి దోచుకున్నారని ఆరోపించారు. పేదలు ఇళ్ల కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఖర్చు అయితే అందులో ఇసుక కొనుగోలుకు రూ.3 లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. గృహ నిర్మాణశాఖకు ఇసుక సరఫరా పేరుతో 98 లక్షల టన్నులు జగన్ అండ్ కో మింగేశారన్నారు. వైసీపీ నేతలు మింగేసిన ఇసుక దాదాపు పది లక్షలకు పైగా గృహ నిర్మాణాలు చేయవచ్చని అంటే అవినీతి ఏ స్థాయిలో చేశారో ప్రజలు అర్థం చేసుకోవచ్చన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 2019, 2021లో ఇసుక విధానంపై తెచ్చిన జీవోలను రద్దు చేసి ఉచిత ఇసుక విధానం కోసం జీవో నెం.43 విడుదల చేసిందన్నారు. తద్వారా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, రాష్ట్ర ప్రగతికి బాటలు వేయనున్నట్లు చెప్పారు. అక్రమ ఇసుక తవ్వకాలను నిరోధిస్తూ ఇసుక పాలసీని రూపొందించారన్నారు. దీనిపై నిరంతరం సెబ్ పర్యవేక్షణ ఉంటుందన్నారు. గృహ నిర్మాణదారులు ఉచిత ఇసుక విధానం సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, యార్లగడ్డ శ్రీనివాసరావు, మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్, డీఎస్పీ మురళీకృష్ణ, తహసీల్దార్ పుల్లారావు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం

● ఇసుక నిల్వలు గుర్తించాలని మైనింగ్ ఏడీకి కలెక్టర్ ఆదేశం

బాపట్ల జిల్లా ప్రజల అవసరాల కోసం ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరమని కలెక్టర్ వెంకటమురళి అన్నారు. సోమవారం సాయంత్రం కొల్లూరు మండలపరిధిలోని జువ్వలపాలెం వద్ద స్టాక్ పాయింట్ ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్‌లో ఉన్న నిల్వల గురించి ఏడీని ఆరా తీశారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్‌లో 30 వేల క్యూబిక్ మీటర్లు ఇసుక అందుబాటులో ఉందని, నదిలో 50 వేలు క్యూబిక్ మీటరు ఇసుక నిల్వలు ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. జిల్లాకు ప్రజలకు అవసరమైన ఇసుక కోసం నదిలో ఎక్కడా ఇసుక నిల్వలు ఉన్నాయో గుర్తించాలని ఏడీని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట రెవెన్యూ, మైనింగ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హామీనిచ్చాం.. అమలు చేస్తున్నాం : ఎంపీ తెన్నేటి



బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డులోని స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

బాపట్ల, జూలై 8 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నూతన ఇసుక పాలసీని తీసుకొచ్చి ప్రజలకు ఉచితంగా ఇసుక అందిస్తున్నట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డులోని స్టాక్‌పాయింట్ దగ్గర సోమవారం సాయంత్రం ఉచిత ఇసుక విధానాన్ని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఆర్డీవో గంధం రవీందర్‌లతో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ఏవిధమైన ఛార్జీలు చెల్లించకుండా కేవలం ఇసుక తవ్వి తీసుకొచ్చినందుకు సీనరేజ్, లోడింగ్, ట్యాక్స్ కలిపి కేవలం మెట్రిక్‌టన్ను 551 రూపాయలకే అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరు ఇదే ధరకు కొనుగోలు చేయాలని ఎవరి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. ధరలు ప్రభుత్వం బహిరంగంగానే ప్రకటించింది కాబట్టి అధికారులు, కొనుగోలుదారులు దానిని అనుసరించాలన్నారు. కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం ప్రకటించిన విధంగా ఇసుక ఇవ్వాలన్నారు. ఈవిధానాన్ని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాణ్యమైన ఇసుకను అందుబాటులో ఉంచాలన్నదే ప్రభుత్వ విధానమన్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులతోనే ఇసుక తీసుకోవాలి : ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డులోని స్టాక్ పాయింట్ వద్ద ఉన్న అధికారులకు ఆన్‌లైన్ చెల్లింపులు చేసి ఇసుక తీసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఏ ఒక్కరికి డబ్బులు ఇవ్వరాదన్నారు. క్రెడిట్‌కార్డు, డెబిట్‌కార్డు, క్యూఆర్‌కోడ్ స్కానింగ్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు అన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఇసుక ఇస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, మాజీ అధ్యక్షుడు కావూరి శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు చెన్నుపాటి కిషోర్, కుర్రా ధనేంద్ర, ఆర్డీవో గంధం రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఉదయం నుంచే బారులు తీరిన వాహనాలు

ప్రభుత్వం ఉచిత ఇసుకను 8వ తేదీ నుంచి ఇస్తున్నట్లు ప్రకటించడంతో బాపట్ల మార్కెట్‌యార్డు వద్ద ఇసుక కోసం సోమవారం ఉదయం నుంచే పెద్దఎత్తున వాహనాలు వచ్చాయి. కర్లపాలెంరోడ్డులో ఓ వైపు ట్రాక్టర్‌లు, మరోవైపు టిప్పర్లు, బాపట్లరోడ్డు వైపు ట్రాక్టర్‌లు బారులు తీరి నిలిచిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇసుక కోసం ప్రజలు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే బ్యాంకు అధికారులు ఇచ్చిన మిషన్‌లో క్యూఆర్ కోడింగ్ రాకపోవటం వల్ల ఆలస్యమైనట్లు సిబ్బంది తెలిపారు. ప్రతిఒక్కరికి రోజుకు 20 టన్నుల ఇసుక మాత్రమే ఇస్తారన్నారు. ట్రాక్టర్‌కు 4.5 టన్నులు లోడ్ చేస్తారన్నారు.

రైతు అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి

● మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్



గుడ్డికాయలంకలో సబ్సిడిపై రైతులకు వరి విత్తనాలను అందిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, జూలై 8 : రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని గుడ్డికాయలంక గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుండటంతో ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలను అందిస్తుందని రైతులు సద్వినియోగించుకోవాలని కోరారు. రైతు సంక్షేమ ప్రభుత్వంగా ఎన్డీయే ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. గత ప్రభుత్వం హయాంలో రైతులను నట్టేట ముంచారని ఎన్డీయే ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులకు అన్ని విధాలా మేలుచేసే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్, ఏవో విజయబాబు, సర్పంచ్ యడాలి వాణి, మాజీ సర్పంచ్ యరగళ్ళ శ్రీనివాసరావు, కేసన రామకృష్ణ, కొలసాని రాము, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సబ్సిడీ విత్తనాలను పొందాలి

చెరుకుపల్లి, జూలై 8: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడి వరి విత్తనాలను విధిగా పొందాలని నియోజకవర్గ టీడీపీ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి అన్నారు. సోమవారం ఆరేపల్లి, తూర్పుపాలెం, ఆళ్ళవారిపాలెం పంచాయతీలలో రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు సబ్సిడి వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాదారు పాస్‌బుక్‌లు ఉన్న రైతులకు సబ్సిడిపై ప్రభుత్వం అందించే పథకాలను పొందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు పిట్టు శ్రీనివాస్‌రెడ్డి, ఊచా వీర్లంకయ్య, టంగు పోతిరెడ్డి, జనసేన నాయకులు మత్తి భాస్కరరావు, పంచాయతీల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ చిరస్మరణీయులు

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, వైసీపీ నాయకులు

బాపట్ల, జూలై 8: పేదలకు విస్తృతంగా సంక్షేమ పథకాలు అందించి ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిరస్మరణీయులని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. వైఎస్సార్ జయంతి వేడుకలను సోమవారం బాపట్ల పట్టణ, మండలంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. బైక్ ర్యాలీ చేసి ఆయా ప్రాంతాల్లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు వైసీపీ నాయకులతో కలిసి కోన రఘుపతి పుష్పాంజలి ఘటించారు. విద్యానగర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణంలోని 9, 11, 31వార్డులలో నిర్వహించిన కార్యక్రమంలో కోన పాల్గొన్నారు.

కర్లపాలెం, జూలై 8 : మండలంలోని పలుగ్రామాల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కర్లపాలెం ఐలెండ్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పిట్టలవానిపాలెం, జూలై 8: వైఎస్సార్ జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పిట్టలవానిపాలెం ఐలెండ్ సెంటర్ కూడలి నందు సోమవారం గాదే యువసేన ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

వేమూరు, జూలై 8 : వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని నియోజకవర్గ కేంద్రం వేమూరులో ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా సాయి మందిర వార్షికోత్సవం



సాయిబాబా మందిర వార్షికోత్సవ పూజలో పాల్గొన్న టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు

వేమూరు, జూలై 8 : మండలంలోని పెనుమర్రులో ఉన్న షిరిడి సాయి బాబా మందిర 17వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున నగర సంకీర్తన అనంతరం స్వామికి కాకడ హారతి సమర్పించారు. మూలవిరాట్ స్వరూపానికి భక్తులతో పంచామృత అభిషేకం జరిపించారు. అనంతరం పట్టు వస్త్రాలు, వెండి ఆభరణాలు గజమాలతో విశేషంగా అలంకరించారు. అష్టోత్తర శతనామ పూజలు జరిపి మహాహారతి సమర్పించారు. సాయంత్రం గ్రామంలో పల్లకి ఉత్సవాన్ని జరిపారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చెయ్యాలి

రేపల్లె, జూలై 8: విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు బానిస కాకుండా విద్యలోరాణించి ఉన్నత శిఖరాలను అవరోధించాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని 3వవార్డులో మున్సిపల్ ఉన్నత పాఠశాల. నక్కవారి చెరువు సమీపంలోని ట్రిబులెక్స్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో ఆశలు పెట్టుకుని ఉన్నారని, వీరు వారి కలలను సాకారం చేసే దిశగా విద్యలో రాణించాలని కోరారు. అనంతరం మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయిని కె.శ్రీదేవి, ఎంఈవో రత్న శ్రీధర్, స్కూల్ చైర్మన్ నన్నపనేని అరవింద్‌బాబు, మాజీ కౌన్సిలర్ దేవగిరి రంగా, జనసేన నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లను బడిలో చేర్పించాలి

చెరుకుపల్లి, జూలై 8: బడిఈడు పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పించాలని జిల్లా సమగ్రశిక్ష సమన్వయకర్త వి.సత్యసాగర్ అన్నారు. సోమవారం మండలంలోని గుళ్ళపల్లిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(హెచ్‌ఈ)ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రారంభించిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండీ నిస్సార్ అహ్మద్, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

అత్యంత ప్రాధాన్యంతో ఫిర్యాదులు పరిష్కరిస్తాం

● ఎస్పీ వకుల్ జిందాల్ ● సమస్యల పరిష్కారం కోరుతూ 65 అర్జీలు



అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, జూలై 8 : అత్యంత ప్రాధాన్యంతో ఫిర్యాదులను పరిష్కరిస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 65 మంది ఫిర్యాదులు అందజేశారు. ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఎస్పీ వకుల్ జిందాల్ వాటిని చట్ట ప్రకారం విచారించి పరిష్కరించాల ని ఆయాస్టేషన్‌ల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. సమస్యలు త్వరగా పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి సమస్యలను పరిష్కరించటానికి కృషి చేయాలని ఎస్పీ ఆదేశించారు. కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు, ఆర్థికలావాదేవీలు, భూవివాదాలు తదితర సమస్యలకు సంబంధించిన అర్జీలు ఈ కార్యక్రమం ద్వారా అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సింగయ్య, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై అధికారుల కొరడా



జాతీయ రహదారి పక్కన ఓలేరు వద్ద లేఅవుట్‌లో ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న అధికారులు

భట్టిప్రోలు, జూలై 8 : గ్రామ పంచాయతీ, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుం డా ఏర్పాటు చేసిన లేఅవుట్లలో అధికారులు సోమవారం ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. మండలంలోని ఓలేరు గ్రామం వద్ద జాతీ య రహదారి పక్కన వేసిన అక్రమ లేఅవుట్లలో చుట్టూ ఉన్న గోడలను తొలగించిన అధికారులు సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ నుంచి గానీ బుడా నుంచి గాని ప్రభుత్వం నుంచి గాని ఎటువంటి అనుమతులు లేనందున సదరు లేఅవుట్‌లో ప్లాట్లు అమ్మినా, కొనుగోలు చేసినా నేరమని హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని లేఅవుట్లు వేసుకోవచ్చునని అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. జాతీయ రహదారి పక్కన వేసిన అన్ని లేఅవుట్లలో హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేయిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఐ మునిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, బుడా అధికారులు, వీఆర్‌వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

యానాదులకు గుర్తింపు పత్రాలు ఇవ్వాలి

● దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ నాయకులు



కలెక్టరేట్ వద్ద యానాదులతో కలిసి సమస్య వివరిస్తున్న దళిత బహుజన రీసోర్స్‌సెంటర్‌నాయకులు

బాపట్ల, జూలై 8: సంచార జాతులకు చెందిన యానాదులకు ఆధార్, రేషన్‌కార్డులు వంటి గుర్తింపు పత్రాలు అందించి ప్రభుత్వ పథకాల్లో భాగస్వాములను చేయాలని దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం యానాదులతో కలిసి ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అర్జీ అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద మాట్లాడుతూ చీరాల మండలం ఈపూరుపాలెం గ్రామానికి చెందిన యానాదులు కాల్వకట్టపై ఎంతో కాలంగా 35 కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. వారిలో ఎక్కువ మందికి నేటికి సరైన గుర్తింపు పత్రాలు లేకపోవటం వల్ల ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారన్నారు. వారిలో ఒక యువకుడు తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికి సరైన పత్రాలు లేక పెన్షన్ పొందలేకపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరికి సరైనపత్రాలు అందించి ప్రభుత్వ పథకాలు అందుకునే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చీరాల ఏరియా కోఆర్డినేటర్ వి.భగవాన్ దాసు, బాపట్ల ఏరియా కోఆర్డినేటర్ నూతలపాటి శ్రీలత, గిరిజన కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు తదితరులున్నారు.

లేబర్ కోడ్ అమలైతే చట్టాల్లో సారం పోతుంది

రేపల్లె, జూలై 8: కార్మికులకు నష్టం చేసే లేబర్‌కోడ్ అమలు చేయటానికి ఉత్తర్వులను జారీ చేయటానికి సిద్ధపడుతుందని తద్వారా చట్టాల సవరణలో కార్మికులకు అన్యాయం జరుగుతుందని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జూలై 10న కార్మికుల డిమాండ్స్‌డే పిలుపులో భాగంగా మండల కేంద్రాల్లో జరిగే ఆందోళనలను కార్మికవర్గం జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు జే ధర్మరాజు, ఎం వెంకటేశ్వరరావు, టీ ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బాల్ టోర్నమెంట్ ప్రారంభం



నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న భోజరాజు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి

కర్లపాలెం, జూలై 8 : కర్లపాలెంలోని పెట్రోల్ బంకు వెనుక ఉన్న ప్రాంగణంలో బాపట్ల నియోజకవర్గస్థాయి క్రికెట్ బాల్ టోర్నమెంట్‌ను సోమవారం టీడీపీ నాయకులు కంకిపాటి భోజరాజు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిట్టు తిరుమలరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అంకిరెడ్డి రవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పురోహిత సంఘం సభలను విజయవంతం చేయాలి

భట్టిప్రోలు, జూలై 8: అహోబిలంలోని పద్మశాలీయ అన్నసత్రంలో ఈ నెల 24 నుంచి జరగనున్న అఖిల భారత పద్మశాలీయ బ్రాహ్మణ పురోహిత సంఘం 26వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర నాయకులు గోలి ప్రభాకర్ కోరారు. సోమవారం భట్టిప్రోలు వచ్చిన ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు కొనసాగే మహాసభల్లో మార్కండేయ మహాయజ్ఞం, భద్రావతీదేవి అమ్మవారికి కుంకుమార్చన తదితర కార్యక్రమాలు బొజ్జన్న పంతులు పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు.

మొహరం నెల పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు

భట్టిప్రోలు, జూలై 8 : మొహరం నెలను పురస్కరించుకుని నెల వంక రోజు సందర్భంగా మండలంలోని సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో గల మసీదు వద్ద మత గురువులు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సూఫీ మత గురువులు హజరత్ సయ్యద్ కరీముద్దీన్‌షా ఖాదరి, హజ్రత్ షా బుఖారి, దర్గా పీఠాధిపతులు సూఫీ మతగురువులు అత్తాఫ్‌బాబాలు జెండా చెట్టు వద్ద నిసాన్, సలాం ఫాతెహఖాని అత్యంత ఘనంగా జరిపించారు.



బస్టాండ్ ఇన్‌గేట్‌లో నిలిచిన వర్షపు నీరు

చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్టాండ్

అద్దంకి, జూలై 8 : చిన్నపాటి వర్షం పడ్డా అద్దంకి లోని ఆర్టీసీ బస్టాండ్ చిన్నపాటి చెరువు ను తలపించేలా మారుతుంది. ఆది, సోమ వారం లలో కురిసిన వర్షాలకు ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ లో పెద్ద ఎత్తున నీరు నిలిచాయి. వర్షపు నీరు సైడ్ డ్రైన్ లోకి వెళ్ళేందుకు సరైన మార్గం లేకపోవటం తో ఎక్కడికక్కడ నిలిచి బస్సుల తో పాటు ప్రయాణికుల రాక పోకలకు ఇబ్బంది గా మారింది. తరచూ నీరు నిలిచి రోడ్డు గోతుల మయంగా మారుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు ఉండటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్టీసీ బస్టాండ్ లో నీరు నిలువ కుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

శివాలయం భూముల కౌలు వేలం

అద్దంకి, జూలై 8 : అద్దంకి పట్టణంలోని పాత శివాలయం (రామలింగేశ్వరస్వామి) దేవాలయం భూముల కౌలు వేలం సోమవారం దేవాలయ ఆవరణలో జరిగింది. అద్దంకి రెవెన్యూ పరిధిలో విప్పర్లవారిపాలెం, నాగులపాడు గ్రామాల సమీపంలో ఉన్న 21.06 ఎకరాల దేవాలయం భూమికి కౌలు వేలం నిర్వహించగా 3,21,600 రూపాయలు పలికింది. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర కుమార్, ట్రస్టీ చిన్ని రామలింగేశ్వరరావు, గుంటూరు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోయిన మంచినీటి చెరువులు..!





నీళ్ల లేక ఎండిపోయిన యద్దనపూడి మంచినీటి చెరువు ... రెండో చెరువులో నీటికుంటలో చేపలు పడుతున్న చిన్నారులు

- యద్దనపూడిలో పొంచి ఉన్న ముప్పు
- తాగునీటికి ప్రజల ఇక్కట్లు

యద్దనపూడి, (మార్టూరు) జూలై 8 : మండల కేంద్రమైన యద్దనపూడి గ్రామంలో తాగునీటి సమస్య పొంచి ఉన్నది. గ్రామానికి ప్రధాన తాగునీటి వనరైన గ్రామం నడిబొడ్డున ఉన్న రెండు మంచినీటి చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. దాంతో గ్రామంలో ఇపుడిపుడే తాగునీటికి సమస్యలు మొదలయ్యాయి. వాస్తవంగా గత 20 రోజుల నుంచి గ్రామంలో చెరువులో నీళ్లలేక కొళాయిల ద్వారా సరఫరా కావడం లేదు. అయితే తాగునీటి సమస్య ఏర్పడకుండా ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఒక చెరువులో పెద్ద లోతైన గుంతను ఏర్పాటుచేసి దాని నుండి నీటిని పైపుల ద్వారా పంప్‌హౌస్‌కు అనంతరం ఓవర్‌హెడ్ ట్యాంకు కు అధికారులు పంపింగ్ చేస్తున్నారు. అంతేగాకుండా చెరువుకట్టపై 300 అడుగులకు పైగానే ఒక బోరును ఏర్పాటుచేసి దానికి మోటారును ఏర్పాటు చేసి నీటిని మోటార్లుద్వారా పంపుహౌస్‌కు మళ్లిస్తున్నారు.కాని ఆశించినంతంగా ప్రజలకు తాగునీరు అందడంలేదని గ్రామస్థులు చెప్తున్నారు. తద్వారా ప్రజానీకం త్రాగునీటికి అధికంగా మంచినీటి ఆర్‌వో ప్లాంటులపైనే ఆధారపడుతున్నారు.

గురుకుల పాఠశాలకు ట్యాంకర్ల ద్వారా

రెండు మంచినీటి చెరువులలో నీళ్ల లేకపోవడంతో గ్రామంలో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు తాగడానికి మంచినీటి సమస్య ఎదురయింది. చెరువులలో నీరు ఉన్నపుడు మోటార్ల ద్వారా గురుకుల పాఠ శాలలోకి మంచినీటిని సరఫరా చేసేవారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు కనీస అవసరాలకు ఉపయోగించేందుకు స్కూల్లో ఉన్న బోరు నీటిని వినియోగిస్తున్నారు. కాని ప్రస్తుతం చెరువులో నీళ్ల లేకపోవడంతో తాగునీటి కోసం విద్యార్థినులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గ్రామంలోని పార్టీ నాయకులకు సూచనలు చేశారు. దాంతో గ్రామంలోని అధికార పార్టీనేతలు గన్నవరం నుండి తాగునీటిని ట్యాంకర్లు ద్వారా స్కూలుకు సరఫరా చేస్తున్నారు. రెండు రోజులకు ఒక ట్యాంకరును స్కూలుకు సరఫరా చేస్తున్నారు. దాంతో ప్రస్తుతానికి తాత్కాలికంగా గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మంచినీటి సమస్య ఇబ్బంది తొలగింది.

సాగర్ జలాలు వచ్చేదెప్పుడు..?

గత మూడు నెలలు క్రితం సాగర్ జలాలను విడుదల చేసినపుడు ఈ జలాలు యద్దనపూడి చెరువులకు చేరలేదు. ఈ సమయంలో నీళ్ల తక్కువగా రావడం అదికూడా కొద్దిరోజులు మాత్రమే నీళ్ల రావడం అంతే గాకుండా కోనంకి సబ్ డివిజన్‌లో దిగువ గ్రామాలకు పూర్తి స్థాయిలో నీళ్ల రాకపోవడంతో యద్దనపూడి మండలంలోని చాలా గ్రామాలకు సక్రమంగా సాగర్ జలాలు చేరలేదు. ఈ నేపథ్యంలో యద్దనపూడి చెరువులకు నీళ్ల రాకపోవడంతో చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. మరల సాగర్ జలాలు వస్తేనే తప్ప లేదా భారీ స్థాయిలోనైనా వర్షాలు కురిస్తేనే గాని చెరువులు నిండే అవకాశం లేదు. మరి సాగర్ జలాలును అధికారులు ఎపుడు విడుదల చేస్తారా అని గ్రామస్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇదిలావుండగా ఒక చెరువులో ఉన్న చిన్న నీటి కుంటలో మాత్రం చిన్నారులు చేపల కోసం వెదుకులాడుతున్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

విదేశీ విద్య పథకం పునఃప్రారంభం హర్షణీయం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 8 : ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన విద్యార్థులకు అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం కింద రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించే ప్రక్రియను సీఎం చంద్రబాబు పునఃప్రారంభించడం హర్షణీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ముక్కోణపు పార్కు సెంటర్లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం పార్టీ శ్రేణులతో కలసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజారంజక పాలన సాగిస్తూ ముందడుగు వేస్తున్నారన్నారు. విద్యాభివృద్ధికి అందిస్తున్న చేయూతను అర్హులు వినియోగించుకోవాలని కొండయ్య కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించండి

నియోజకవకర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకుగాను రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కొండయ్య అధికారులకు చెప్పారు. పార్టీ కార్యాలయంలో సోమవారం పంచాయతీరాజ్‌శాఖ డీఈఈ శేషయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ నరసింహులు, చీరాల, వేటపాలెం మండలాల ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతం చేయించండి. కాంట్రాక్టర్లుకు బిల్లులు మంజూరు చేయండి. అంతకుముందు నాణ్యత ప్రమాణాలను పక్కాగా పరీక్షించండి. నాణ్యతలో ఎక్కడ రాజీపడొద్దని స్పష్టం చేశారు. పనులకు సంబంధించిన నివేదికలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని చెప్పారు. పలు సూచనలు చేశారు. అధికారుల సందేహాలను నివృత్తి చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రైతులు

పంగులూరు, జూలై 8 : మండలంలో చోరీ జరిగిన ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసి వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు డిమాండ్ చేశారు. చోరీ జరిగిన ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసి, రైతులను ఆదుకోవాలని పంగులూరు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్‌లకు దొంగల బెడద ఎక్కువైందన్నారు. పోయిన చోట ఏర్పాటు చేయడంలో విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వ్యవసాయ సీజన్ దృష్ట్యా తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కృష్ణమూర్తి, మల్లారెడ్డి, ఆదుంసాహెబ్, హనుమంతరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రేపు జాతీయ కోర్కెల దినోత్సవం

చినగంజాం, జూలై 8 : జాతీయ కోర్కెల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ కార్మికులకు పిలుపునిచ్చారు. చినగంజాంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యులు జి.యాకోబు అధ్యతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10వ తేదీన జాతీయ కోర్కెల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్, ఆర్‌డీవో కార్యాలయాల వద్ద, మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జీవి.రాంప్రసాద్‌రెడ్డి, డి.రాఘవులు, సీహెచ్.శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

చదువుకు ఆర్థిక సాయం

పంగులూరు, జూలై 8 : గుజరాత్ రాష్ట్రంలో ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థుల వసతి ఖర్చులకు రామకూరు చారిటబుల్ ట్రస్ట్ వారు 10వేల ఆర్థిక సాయం అందించారు. మండలంలోని కల్లంవారిపాలెం గ్రామానికి చెందిన భవనం అభిరామిరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి సవాని వర్సిటీలో బీటెక్ చదువుతున్నారు. వారి చదువుకు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి డోర్ల ఆంజనేయవర ప్రసాద్ సోమవారం సాయం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఐ మృతికి కారుకులపై చర్యలు తీసుకోవాలి

చీరాలటౌన్, జూలై 8 : తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటలో విధుల్లో ఉన్న దళిత ఎస్‌ఐ ఆత్మహత్యకు పాల్పడడం విషాదకరమని పలువురు దళిత బహుజన పార్టీ ప్రతినిధులు అన్నారు. ఎస్సై మృతిపై సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సై శ్రీనివాసరావును ఉన్నతాధికారులతో పాటు కింది స్థాయి ఉద్యోగులు ఏకమై కులం పేరుతో దూషించి అవమానాలకు గురిచేసినట్లు ఆరోపించారు. ఈక్రమంలో ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ నాసరయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు జిలానీ, మిక్కిలి లావణ్య, రబ్బానీ, బాషా, శ్రీను పాల్గొన్నారు.

ఆవరణల్లో మందుబాబుల ఆగడాలు

ఇంకొల్లు, జూలై 8 : ఇంకొల్లు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మందుబాబుల ఆగడాలు పెరిగిపోయాయి. కార్యాలయాలకు ప్రహరీగోడలు లేకపోవడంతో రాత్రి వేళల్లో మద్యం సేవించేందుకు ఆ ప్రాంతాలు అనువుగా ఉండటంతో రాత్రి వేళల మందుబాబులు అక్కడకు చేరి వారి తాగి ఆగడాలు సాగిస్తున్నారు. కార్యాలయాల ఆవరణల్లో లైట్లు సక్రమంగా వెలగకపోవడం, దీనిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారికి అడ్డూఅదుపు లేకుండా పోతుంది. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ప్రధానవాకిలి ముందు మద్యం కాళీ సీసాలు, వాటర్ బాటిళ్ల సిబ్బంది వచ్చి తలుపులు తీసే సమయానికి దర్శనమిచ్చాయి. చివరికి తాగిన మద్యం సీసాలు, వాటర్‌బాటిల్స్ సైతం అక్కడే వదిలేసి వెళ్తున్నారు. అధికారులు పట్టించుకొని రాత్రి వేళల్లో వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుకుంటున్నారు.

వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, జూలై 8 : విజయనగర్ కాలనీలో వెంకయ్య ఆశ్రమంలో సోమవారం రోటరీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. రొటేరియన్లలో చెరుకూరి అంజిబాబు కుమారుడు సందీప్ జ్ఞాపకార్థం వృద్ధులు, పేదలకు అన్నదానం చేశారు. అనంతరం వారికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మద్దుమాల కోటేశ్వరరావు మాదాల సాంబ శివరావు, కొత్రపాటికాజారావు, ఇంటూరి ఆంజనేయులుషేక్ కాజా హుస్సేన్ పాల్గొన్నారు.



ఆశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్న రోటరీ సభ్యులు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ అమ్మవారు

ఘనంగా గంగమ్మ గ్రామోత్సవం

చినగంజాం, జూలై 8 : మండలంలోని కడవకుదురు గ్రామంలో గంగమ్మ అమ్మవారి కొలువుల కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గంగమ్మ అమ్మవారి కొలువుల కార్యక్రమంలో భాగంగా సోమవారం అమ్మవారికి పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారి హైమారావు ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. సోమవారం రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై అమ్మవారి ప్రభను ఉంచి గ్రామంలోని పురవీధులలో మేళతాళాలు, కనకతప్పెట్లు, బాణసంచా, యువకుల నృత్యాల నడుమ గ్రామోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి పొంగళ్లను సమర్పించి కొలువుల కార్యక్రమాలను ముగిస్తున్నట్లు ఆలయ పూజారి తెలిపారు. యాదవ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు జరిపారు.

గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడు



ప్రచారం నిర్వహిస్తున్న ఇందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు

పంగులూరు, జూలై 8 : ఆది మధ్యాంత రహితుడైన పరమాత్మ భూమిపై జన్మిస్తే ఆయనను గురువు అని అంటామని, గురు పౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణభగవానుడని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు మడియం పెద్దిరెడ్డి అన్నారు. ఈ నెల 21న వచ్చే గురుపౌర్ణమిని పురస్కరించుకుని పంగులూరు, కోటపాడు, జనకవరం గ్రామాలలో నరసరావుపేటకు చెందిన ఇందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు ఎలిశెట్టి రమేష్, కాటం పోతు రాజు, చల్లగుండ్ల భాస్కరరావు, పగడాల రామయ్య, కుంచాల చినవెంకయ్య, వెంకటేశ్వర్లు, పగడాల అశోక్, అమరలింగయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

అందుబాటులోకి ఉచిత ఇసుక

- నెరవేరనున్న పేదల సొంతింటి కల
- ఊపందుకోనున్న నిర్మాణ రంగం
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



పర్చూరు, జూలై 8 : రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చిందని, పేద మధ్య తరగతి ప్రజలకు ఇసుక కష్టాలు తీరనున్నాయని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు ఇసుక అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. ఏపీ ప్రభుత్వం ఇసుక విధానాన్ని తీరుసుకురావడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ విధానంతో నిరుపేద మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట లభించిందన్నారు. వైసీపీ పాలనలో తప్పుడు విధానాల వల్ల నిర్మాణ రంగం కుదేలైందన్నారు. పేదల సొంతింటి కల మధ్యలోనే నిలిచిపోయిందన్నారు. ఐదేళ్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. ఫ్రీ శాండ్ పాలసీని అమలు చేస్తూ జీవో నెంబర్ 43 విడుదల చేయడం బడుగు, బలహీన వార్గల అభ్యున్నతికి రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందన్నారు. నాణ్యమైన ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే చంద్రబాబు ప్రభుత్వం లక్ష్యం అన్నారు. జగన్‌రెడ్డి ఇసుక మాఫియాను నడిపారని ఏలూరి అన్నారు. ఒక్క ఇసుక కుంభకోణం ద్వారా 50వేల కోట్లకు పైగా కొల్లగొట్టారని ఆరోపించారు. వైసీపీ నేతలే నేరుగా ఇసుకాసురులుగా అవతారం ఎత్తి కోట్లు స్వాహా చేశారని మండిపడ్డారు. పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షల ఖర్చు అయితే అందులో ఇసుకకే రూ.3లక్షలు ఖర్చు చేయాల్సిన దుస్థితి వైసీపీ పాలనలో నెలకుందన్నారు. గృహ నిర్మాణ శాఖకు సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేశారన్నారు. ప్రజా ప్రభుత్వ నిర్ణయంతో ప్రజల కష్టాలు పూర్తిగా తొలగిపోయాయి అన్నారు.

గంగవరం రోడ్డు అభివృద్ధితో మేలు

ఇంకొల్లు, జూలై 8 : ఇంకొల్లు నుంచి గంగవరం మీదుగా పంగులూరు వరకు ఉన్న ఆర్ అండ్‌బీ రహదారిని రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేసే ఇంకొల్లు ప్రాంత ప్రజలకు జాతీయ రహదారికి చేరుకునేందు రవాణా సౌకర్యవంతంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య అన్నారు. సోమవారం ఆయన ఇంకొల్లు వచ్చిన సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని, అభివృద్ధి కార్యాక్రమాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నారని గరటయ్య చెప్పారు.

వెంకటేశ్వర్లుకు నివాళి

ఇంకొల్లు, జూలై 8 : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి తొలి అధ్యక్షుడిగా పని చేసిన మండలంలోని గొల్లపాలెం శివారు గ్రామానికి చెందిన చెల్లపల్లి వెంకటేశ్వర్లుకు పలువురు నివాళులర్పించారు. గొల్లపాలెంలో ఆయన దశదిన కర్మ పాల్గొన్నవారు వెంకటేశ్వర్లు చేసిన సేవలను గుర్తుచేశారు. వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉచిత ఇసుక పంపిణీ ప్రారంభం

అద్దంకి, జూలై 8 : ఉచిత ఇసుక సరఫరా పథకాన్ని సోమవారం నుంచి ప్రారంభించారు. మండలంలోని తిమ్మాయపాలెం వద్ద గుండ్లకమ్మ నది ఇసుక స్టాక్ పాయింట్ నుంచి అందజేస్తున్నట్లు ఆర్ఐ శంకర్ తెలిపారు. టన్ను ఇసుక రూ.197 చొప్పున ఒక్కొక్కరికీ 20 టన్నుల ఇసుక ఇవ్వటం జరుగుతుందన్నారు. తిమ్మాయపాలెం డంపింగ్ పాయింట్ వద్ద 5,100 టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక అవసరమైన వ్యక్తులు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకు రావాలని తెలిపారు.



రశీదును అందిస్తున్న తహసీల్దార్ సంధ్యశ్రీ

మార్టూరు : మార్టూరులో ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. స్థానికంగా పాల కేంద్రంవద్ద ఇసుక రీచ్ నుంచి ఇసుకను ఉచితంగా పంపిణీ చేయడానికి మైనింగ్ రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు. ఇసుకకు అధికారులు ఎలాంటి సొమ్ములు వసూలు చేయకుండా కేవలం సీనరేజీ తదితర టాక్సులు నిమిత్తం టన్నుకు రూ.458 ధరను నిర్ణయించారు. దాంతో మార్టూరు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ అనే వ్యక్తి 4 టన్నుల ఇసుకకు ఇసుకరీచ్ వద్ద రూ.1832 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. దాంతో అతనికి మొదటగా ఇసుక చెల్లింపు రశీదును తహసీల్దార్ సంధ్యశ్రీ అందించారు. తరువాత అతనికి 4 టన్నుల ఇసుకను లోడింగ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రహమాన్ బాషా, వీఆర్‌వో రవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఇసుక బుకింగ్‌కు ఏర్పాటు చేసిన శిబిరంలో సచివాలయ సిబ్బంది

ఉచిత ఇసుక ధరపై పునరాలోచించండి

ఎమ్మెల్యే కొండయ్య దృష్టికి తెచ్చిన వినియోగదారులు

ఉచిత ఇసుక పాలసీ సోమవారం నుంచి అమలులోకి వచ్చింది. ఈ క్రమంలో చీరాల నియోజకవర్గంకు సంబంధించి 216 జాతీయ రహదారి పక్కన పందిళ్లపల్లి వైజంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన ఇసుక డంప్‌లో విక్రయాలు ప్రారంభించారు. టన్ను రూ.675గా నిర్ణయించారు. దీంతో ఒక్కో ట్రాక్టరుకు 4.5 టన్నులను లోడ్ చేస్తారని, అందుకు సంబంధించి ట్రాక్టరుకు వచ్చి రూ.3,038 చెల్లించాలని (క్యూఆర్ కోడ్ ద్వారా) అక్కడ నియమించిన సచివాలయ సిబ్బంది ఇసుక కోసం వచ్చిన వారికి చెప్పారు. అయితే ఇటు మార్టూరు, బాపట్ల తదితర ప్రాంతాలతో పోలిస్తే చీరాలలో ఇసుక ధర అధికంగా ఉంది. దీంతో కొనుగోలుదారులు పెదవి విరుస్తున్నారు. వచ్చిన వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇదిలావుంటే ఇసుక విక్రయాలకు సంబంధించి పూర్తిస్థాయి మార్గదర్శకాలు రాలేదని, అందుకు కొంత సమయం పడుతుందని ఒకరిద్దరు కొనుగోలుకు సుముఖత చూపిన వారికి అక్కడి సిబ్బంది తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొండయ్య టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసయాదవ్ ఉచిత ఇసుక పాలసీ తీరుతెన్నులు, ప్రజాభిప్రాయం ఎలా ఉంది. ఏమన్నా లోటుపాట్లు ఉన్నాయా అనే కోణంలో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో చీరాల నియోజకవర్గంలో నిర్ణయించిన ధర ఎక్కువగా ఉందని , దానిపై పునరాలోచించాలని చెప్పినట్లు తెలిసింది. మొత్తమ్మీద వైసీపీ పాలనలో కొనుగోలు చేయలేని ఇసుక ప్రస్తుతం పారదర్శక ధరతో అందుబాటులోకి వచ్చిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కోటప్పకొండకు పాదయాత్రగా తరలి వెళుతున్న తమ్ముళ్లు

కోటప్పకొండకు పాదయాత్ర

మొక్కులు తీర్చుకున్న కారంచేడు తెలుగు తమ్ముళ్లు

కారంచేడు(పర్చూరు), జూలై 8 : వైసీపీ గద్దె దిగడం, ప్రజా కూటమి విజయం సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు విజయం సాధించడంతో కారంచేడు గ్రామ తెలుగుదేశం పార్టీ శ్రేణులు అభిమానం చాటుకున్నారు. కారంచేడు నుంచి కోటప్పకొండకు సోమవారం పాదయాత్రను చేపట్టారు. టీడీపీ అధికారంలోకి వచ్చి, చంద్రబాబు సీఎంగా, ఎమ్మెల్యేగా ఏలూరి గెలుపొందితే కోటప్పకొండకు వస్తామని మొక్కుకున్నారు. వారి కోరిక నెరవేరడంతో స్వామివారికి మొక్కులు తీర్చుకేనేందుకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో బోడాడ హరి, కొల్ల భాస్కర్, గోరంట్ల వెంకటరత్నం, చాగంటి నాయనమ్మ, నల్లగొర్ల శ్రీరాములు, చాగంటి లక్ష్మీన్నారాయణ, యార్లగడ్డ ప్రహాదు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

ఆర్యవైశ్యులకు అన్నివిధాలా అండగా ఉంటాం

ఎమ్మెల్యే కొండయ్య, ఎంపీ కృష్ణప్రసాద్

చీరాల, జూలై 8 : ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక ఎంజీసీ మార్కెట్‌లో సోమవారం ఎంజీసీ మార్కెట్ డెవపల్‌మెంట్ సొసైటీ, ది టెక్స్‌టైల్ మర్చంట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంపీ ఇరువురు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాము వెన్నంటి ఉండి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. అనంతరం ఇరువురును కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాతాని ఉమామహేశ్వరరావు, ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారులు, నాయకులు, కార్యకర్తలు ఎల్గొన్నారు.

వైఎస్ జయంతి కార్యక్రమాలకు నేతలు దూరం

హాజరు కాని మునిసిపల్ చైర్‌పర్సన్, పలువురు కౌన్సిలర్‌లు

అద్దంకి, జూలై 8 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాలు వైసీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలలో సోమవారం ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమాలకు వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం చినహనిమిరెడ్డి హాజరయ్యారు. స్థానికంగా పలువురు నేతలు దూరంగా ఉండటం చర్చనీయాంశమైంది. టీడీపీ కూటమి అధికారంలో ఉండడంతో వైసీపీ కండువాలతో గెలిచిన పలువురు ప్రజాప్రతినిధులు కార్యక్రమాలకు ముఖం చాటేసినట్లు తెలుస్తోంది. అద్దంకి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో వైఎస్ విగ్రహానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం చినహనిమిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ జ్యోతి హనుమంతరావు, అద్దంకి పట్టణ, మండల పార్టీల అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, జగన్మోహనరెడ్డి, బీవీ కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా అద్దంకి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మతో పాటు వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కౌన్సిలర్‌లు కొమ్మాలపాటి సుధీర్, మరికొందరు వైసీపీ కౌన్సిలర్‌లు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొంత మంది కౌన్సిలర్‌ల భర్తలు మాత్రం హాజరయ్యారు. మున్సిపల్ పాలక మండలిలోని ఇద్దరు కౌన్సిలర్‌లు ఎన్నికలకు ముందే టీడీపీ గూటికి చేరగా, మంత్రి రవికుమార్ ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షకు వైస్ చైర్మన్ దేసు పద్మేష్ హాజరయ్యారు. చైర్‌పర్సన్‌తో పాటు మరికొంతమంది కౌన్సిలర్‌లు దూరంగా ఉండడంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం తగ్గడం ఖాయంగా కన్పిస్తుంది.



నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చినహనిమిరెడ్డి, నేతలు

చీరాల : గడియార స్తంభం సెంటర్లోను సోమవారం వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వైసీపీ శ్రేణులు పూలమాలలువేసి నివాళులర్పించారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, గవిని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ఆమంచి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో జరిగిన వైఎస్ జయంతి వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, నియోజవకర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్, సీఎం రేవంత్‌రెడ్డికి బొకే ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆమంచితో పలువురు చీరాల ప్రాంత నాయకులు పాల్గొన్నారు.